క్లుప్తంగా

మాదక ద్రవ్యాల నిరోధక కమిటీల ఏర్పాటు



గురుకులంలో మాదక ద్రవ్య నిరోధక కమిటీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బూర్జ: మండలంలో గల అన్ని ప్రభుత్వ జెడ్పీ హెచ్ఎస్‌లు, కొల్లివలస కేజీబీవీ, ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్, కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీలు సోమవారం ఏర్పాటు చేశారు. గుట్కా, ఖైనీ, గంజాయి తదితర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా కమిటీలను ఏర్పాటు చేసి, ఆ బాధ్యతలు కమిటీ మెంబర్లకు అప్పగించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ప్రశంస



రాంబాబుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

కొత్తూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లోతుగెడ్డ రాంబాబు ప్రతిభను జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి గుర్తించారు. ప్రశంసాపత్రాన్ని సోమవారం శ్రీకాకుళంలో అందజేశారు. ఈ నెల 14 తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధికంగా 32 ఐపీసీ కేసులను రాజీ చేసేందుకు కృషి చేసిన రాంబాబును ఎస్పీ అభినందించారు. రాంబాబుకు సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు

నేడు, రేపు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు



కోర్టులు సిద్ధం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళ, బుధవారాల్లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నామని గేమ్స్ కో ఆర్డినేటర్ ఆనంద్ సోమవారం తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారన్నారు. దీంట్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు పారంభవుతాయన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. కళాశాల మైదానంలో ఆటల పోటీలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రమ శిక్షణగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం రామారావు, పీడీ యశోద

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం పి.రామారావు, పీడీ యశోద సోమవారం అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగిన (స్కూల్ గేమ్స్ పోటీల్లో) ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో 9వ తరగతికి చెందిన పి.డార్విన్, బి.హారిక రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో వి.అను (9వ తదరగతి), టి.తిరుమలరావు (6వ తరగతి), పి.భార్గవ రామ్ (8వ తరగతి) ఎంపికయ్యారు. వీరు వచ్చే నెలలో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అకాంక్షించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో విద్యత్ దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో రాత్రివేళ అవస్థలు పడుతున్నామని గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. వీధిలైట్ల సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని శ్రీను, రాకేష్ తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

● పాఠశాల ఆవరణలో వరద నీరు



సారవకోట మండలంలో సోమవారం వర్షం కురిసింది. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వరద నీరు చేరింది. ఈ నీటిలోనే విద్యార్థులు నడుచుకుంటూ తరగతులకు హాజరయ్యారు.

– సారవకోట

● పేరుకుపోయిన గుర్రపు డెక్క



సారవకోట మండలంలోని కోదడ్డపనస సమీపంలో వంశధార ప్రధాన కాలువ నుంచి కిందకు వెళ్లే కాలువ పూర్తిగా గుర్రపుడెక్కతో నిండిపోయింది. ప్రస్తుతం ప్రధాన కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గుర్రపుడెక్క నీటితో కొట్టుకు వస్తోంది. చిన్న కాలువలోకి చేరి నీటి ప్రవాహానికి అడ్డంగా ఉండిపోతోంది.

– సారవకోట

● ఆకట్టుకున్న కోలాటం



పుట్టపర్తిలో ఉన్న భగవాన్ సత్యసాయి మందిరంలో సోమవారం పర్తియాత్ర సందర్భంగా ఎల్.ఎన్.పేట మండలంలోని శ్యామలాపురం గ్రామానికి చెందిన బాలవికాస్ చిన్నారుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామానికి చెందిన భగవాన్ సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు ఆధ్వర్యంలో 40 మంది భక్తులు పర్తియాత్రకు తరలి వెళ్లారు. చిన్నారులకు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు అభినందించారు. యూత్ కో ఆర్డినేటర్ టి.దుర్గారావు, బాల వికాస్ గురువు లావేటి శైలజ, కోలాట ట్రైనీ ఇంద్రాని పాల్గొన్నారు.

– ఎల్.ఎన్.పేట

- ఇతర జిల్లాలకు పరిచయంలేని పంట
- మార్కెటింగ్ సౌకర్యం లేక దళారులకే విక్రయిస్తున్న వైనం
- పెట్టుబడి వ్యయం పెరిగిపోతుందంటున్న రైతులు

సారికంద సాగు.. బహు బాగు



శ్రీముఖలింగంలో పండించిన సారికందను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

జలుమూరు: సారికంద కేవలం శ్రీకాకుళం జిల్లాకే పరిమితమైన పంట. రుచితోపాటు ఆరోగ్యానికి కూడా మంచిదని వైద్యులు చెబుతున్నారు. సారికంద సాగు జిల్లాలోని జలుమూరు, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో వీటి సాగు అధికంగా, వజ్రపుకొత్తూరు, సారవకోట తదితర మండలాల్లో అరకొర సాగవుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 వేల ఎకరాల వరకు సాగవుతున్నట్లు అంచనా.

పెట్టుబడి వ్యయం ఎక్కువ..

మే, జూన్ నెలలో పొలాన్ని దుక్కిదున్ని బోదెలు, కలుపు నివారణ, ఎరువులు, విత్తనాలు తదితర వాటికి ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడికి సంబంధించి 45 టన్నులు దాటితే ఎకరాకు ఆయా ఏడాది ధర మేరకు సుమారు రూ.40 వేల వరకు మిగులుతుంది. దళారులు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తోంది.

సాంకేతికత అందిపుచ్చుకోవాలి

సారికంద సాగు చేసే రైతులు పాత పద్ధతిలో కంటే సాంకేతిక అందిపుచ్చుకుని యాజమాన్య పద్ధతులు పాటించాలి. బోదెలా కాకుండా బెడ్‌లు మీద పిలకలు నాటాలి. వీటితోపాటు మొక్కలకు తెగుళ్లు, వ్యాధులు సోకితే చేతి పంపుల ద్వారా కాకుండా పవర్ స్ప్రేయిర్లు వినియోగించుకోవాలి. షేర్ నెట్ వంటి పద్ధతులు వినియోగించుకోవాలి. ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.8వేల రాయితీ ఇస్తున్నాం.

– మంగమ్మ, ఉద్యానవన శాఖ అధికారి

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



తాము పండించిన పంటకు మార్కెట్ సౌకర్య కల్పించాలి. కేవలం శ్రీకాకుళం జిల్లాకే పరిమతం అవ్వడంతో ధర పెరగడం లేదు. టన్ను కేవలం రూ.8 వేల ఉంటుంది. ఇతర జిల్లాలకు చేరవేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు చొరవ చూపాలి

– శాంతన్ పాణిగ్రాహి, రైతు, శ్రీముఖలింగం

మద్దతు ధర పెంచాలి



ప్రతి ఏడాది టన్ను రూ.8 వేల ధర పలుకుతోంది తప్ప.. ధర పెరగడంలేదు. ఈ ఏడాది కూడా అలాగే ఉంది. ధర పెంచేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. ప్రధానంగా రుణ సౌకర్యం కల్పించాలి. మేలు రకం విత్తనాలు కూడా అందించాలి.

– నరేష్ పండా, రైతు, శ్రీముఖలింగం

గిడ్డంగి సౌకర్యం కల్పించాలి



గిడ్డంగి సౌకర్యం కల్పించాలి. పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో సీజన్‌లో పండించే కొద్ది రోజుల్లోనే అమ్మకాలు చేస్తున్నాం. దీని వల్ల రైతులకు ప్రయోజనం లేదు. దళారులే లాభపడుతున్నారు.

– కె.వి.మహంతి, రైతు, ఎల్ఎన్‌పేట

వంద రోజుల్లో చేసింది శూన్యం



- వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందు లడ్డూ.. నెయ్యి అంటూ తప్పుడు ప్రచారం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: చంద్రబాబు వంద రోజుల పరిపాలనలో హామీలు అమలు చేయలేదని, ప్రజలు నిలదీస్తారనే భయంతోనే తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తిరుపతి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామి మహా ప్రసాదానికి దేశంలో ఎంతో గుర్తింపు, పవిత్రత ఉందన్నారు. అలాంటి వెంకటేశ్వర స్వామి ప్రసాదం పేరుతో చంద్రబాబు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కల్తీ నెయ్యి కలిసిందని తప్పుడు ప్రచారం చేయటం వారి స్వార్థ రాజకీయానికి నిదర్శనమన్నారు. 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు అని చెప్పి ప్రజలకు మోసం చేసిన చంద్రబాబు.. ఎన్నికల తరువాత ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసి మోసం చేయటం ఆయనకు పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు భవిష్యత్‌లో మరిన్ని చేస్తారన్నారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ అనేక సభల్లో రెడ్ బుక్ కోసం అధికారులకు, ప్రతిపక్ష నాయకులకు భయపెట్టారని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు, హత్య ప్రయత్నాలు, దాడులు, మహిళలపై దాడులు, కొందరి వ్యక్తుల ఆస్తుల అక్రమణలు, కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయన్నారు. తుఫాన్ కారణంగా బుడమేరుకు వచ్చిన వరదలతో విజయవాడలో కొంత ప్రాంతం సర్వనాశనం అయిందన్నారు. అక్కడి వరద బాధితులకు ఆదుకోవటంలోనూ, వారికి సహాయక చర్యలు అందివ్వటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దాతలు ఇచ్చిన విరాళాలతో వరద బాధిత ప్రజలకు ఎన్నో సౌకర్యాలు కల్పించవచ్చని, అయినా చంద్రబాబు ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందన్నారు. మంచి ప్రభుత్వం అని ప్రజల వద్దకు వెళుతున్నారని.. ఇది మంచి ప్రభుత్వం కాదు ప్రజలను ముంచే ప్రభుత్వమని అన్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ ఆర్ కాలనీలో నిర్వాసితుల ముసుగులో కొంతమంది చేసిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, ఎస్.బాలరాజు ఫిర్యాదు చేశారు. ఒకే వ్యక్తికి రెండు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. ఇంటి స్థలంతోపాటు రూ.4,47,000 నగదును ప్రభుత్వం నుంచి చాలా మంది అక్రమంగా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా ఇళ్ల స్థలాలు మంజూరైన వారిలో బి.ఢిల్లేశ్వరరావు, అడపాకల ఫల్గుణరావు, జగ్గునాయుడు, కూర్మారావు, చిట్టిబాబు, సూర్యనారాయణ, శివగిరి, రాములు, బి.రాజారావు, కొండలరావు, జి.వెంకటరమణ, పూర్ణిమ తదితరులు ఉన్నట్లు తెలిపారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కర్లెమ్మ గ్రామ రెవెన్యూలో...

మండలంలోని కర్లెమ్మ గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు అధికారులను కోరారు. కలెక్టర్‌కు రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు. రీ సర్వేలో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన

మెళియాపుట్టి: వర్మీకం పోస్ట్ ఉపయోగించి పండించే పంటల ద్వారా అత్యధిక దిగుబడితోపాటు ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఒడిశా (రాసూరు) సెంచూరియన్ కళాశాలలో ఎగ్రికల్చర్ బీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అన్నారు. సోమవారం మండలంలోని కొసమాల గ్రామంలో రైతులకు సేంద్రియ సాగు, వర్మీకంపోస్ట్ తయారీ విధానం, ఉపయోగాలు తెలియజేశారు. వర్మీకం పోస్టు ఎరువు ద్వారా మొక్కలకు సహజసిద్ధమైన పోషకాలు లభిస్తాయని, భావితరాలకు మంచి వాతావరణం, పంటలు అందించవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. విద్యార్థులు కె.సత్యహరీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వర్మీకంపోస్ట్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

జూనియర్ లైన్‌మన్‌ను నియమించాలి

మెళియాపుట్టి: మండలంలోని ఇల్లాయిపురం, ఆంపురం, గొట్టిపల్లి గిరిజన గ్రామాల్లో సుమారుగా 800 పైచిలుకు సర్వీసులున్నాయని, జూనియర్ లైన్‌మన్‌ను వెంటనే నియమించాలని టెక్కలి విద్యుత్ శాఖ డీఈ శంకరరావును ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు సోమవారం కోరారు.

టెక్కలిలో డీఈని కలిసి వినతిపత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. ఇల్లాయిపురం సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన జూనియర్ లైన్‌మన్ యడ్ల లోకేష్, పాతపట్నం మండలంలోని తెంబూరులో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పలుమార్లు సమస్యలపై అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. వినతిపత్రం అందించినవారిలో సర్పంచ్‌లు గవిరేసు, జమ్మయ్య, కేరాసింగి ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, జనార్దన పాల్గొన్నారు.



డీఈకి సమస్యను వివరిస్తున్న సర్పంచ్‌లు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

మెళియాపుట్టి: మండలంలోఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న మెటీరియల్ కాంపోనెంట్, ఇతర పనుల్లో నాణ్యత పాటించాలని శ్రీకాకుళం సీనియర్ నాణ్యతాప్రమాణాల అధికారి సతీష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో అవసరమైన అన్ని పనులు గుర్తించాలని, వాటికి అంచనాలు తయారుచేసి పనులను మొదలుపెట్టేలా దృష్టి సారించాలన్నారు. హార్టీకల్చర్ ద్వారా మొక్కలను సంరక్షించేలా రైతులకు సూచనలు చేయాలన్నారు. గృహనిర్మాలు చేపట్టిన వారికి ఉపాధిలో 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఏపీఓ టి.రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కాఖండ్యాం ఇసుక ర్యాంపుపై ఫిర్యాదు

సాక్షి టాస్క్ ఫోర్సు: బూర్జ మండలంలోని మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపుపై శ్రీకాకుళం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు మండలంలోని గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కుమార్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపులో చలానా కట్టినా అక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. నదీ గర్భంలో లోడింగ్‌పైన, సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత రవాణా జరుగుతుందని ఫిర్యాదు చేశారు. అనుమతులకు విరుద్ధంగా అక్రమాలు జరుగుతున్నాయని, ఇసుక తరలింపుపైన ఉన్నతాధికారులతో వెంటనే దర్యాప్తు చేయించాలని కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సురేష్‌కుమార్

చెకుముకి పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ

నరసన్నపేట: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించేందుకు చెకుముకి పేరున టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక కన్వీనర్లు సురేష్‌బాబు, సాయి శ్రీనివాసశర్మ తెలిపారు. ప్రతీ ఏటా పాఠశాల, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నామన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ ఒకటో తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ పరీక్షలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దంత లక్ష్మణ్, కృష్ణకుమార్, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక కన్వీనర్లు, ఉపాధ్యాయులు

మతిస్థిమితం లేని మహిళ మృతి



పార్వతి (ఫైల్)

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఈపి పార్వతి (58) అనే మహిళ మతిస్థిమితం లేక అనుమానాస్పదంగా ఆదివారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మృతురాలి కుమారుడు ఈపి గణేష్ తెలియజేసిన వివరాలు మేరకు.. తన తల్లి పార్వతి గత కొంత కాలంగా మతిస్థిమితం లేక పలు చోట్ల తిరుగుతుండేదన్నారు. ఆదివారం ఎవరి పనులపై వారు బయటకి వెళ్లి పోయామన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి కనిపించకపోవడంతో వెతికామన్నారు. గ్రామ పొలి మేరలో ఉన్న మంచి నీటి బావికి దగ్గరలోని సీఎస్పీ రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించామన్నారు. వెంటనే ప్రైవేట్ వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా బూర్జ జంక్షన్ వద్దకు వచ్చే సరికి మృతి చెందిందన్నారు. తల, శరీరంపైన తీవ్రగాయాలు ఉండటంతో రోడ్డు ప్రమాదానికి గురైందా, మతిస్థిమితం లేక పడిపోవడం వల్ల గాయపడి ఉంటుందా అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు గణేష్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.ప్రవలిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

జలుమూరు: మండల పరిధిలోని 40 పంచాయతీల్లో మంగళవారం నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నామని ఏఓ కె.సురేష్ కుమార్ సోమవారం తెలిపారు. మంగళ, బుధ వారాలలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు రైతులతో కలిసి పొలాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు వారితో సమావేశం నిర్వహించ సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5-30 గంటల వరకు ఈ సమావేశాలు ఉంటాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: ఈ నెల 24 నుంచి డిసెంబర్ 31 తేతఅ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఏఓ స్వర్ణలత సోమవారం తెలిపారు. 24న ఉదయం 8.30 గంటల నుంచి 12 గంటల వరకు లబ్బ రైతు సేవా కేంద్రంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటలకు గొట్టిపల్లి రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో రైతులకు పంటల సాగు, యాంత్రీకరణలో వచ్చే మార్పులపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు యాంత్రీకరణ సాగులో మెలకువలు తెలియజేస్తామన్నారు.

ఎంపీడీఓ బదిలీ

సారవకోట: స్థానిక ఎంపీడీఓగా విధులు నిర్వహించిన రాంబాబుకు విజయనగరం జిల్లా బదిలీ అయినట్లు ఆదివారం రాత్రి ఉత్తర్వులు అందాయి. గతేడాది ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడకు వచ్చారు. ప్రస్తుత సాధారణ బదిలీల్లో విజయనగరం జిల్లాకు వెళ్తున్నారు. అలాగే విద్యుత్ శాఖలో సారవకోట లైన్‌మన్‌గా పనిచేస్తున్న పార్వతీశంకు బుడితి గ్రామానికి బదిలీ చేశారు. నిమ్మాడలో లైన్‌మన్‌గా పనిచేస్తున ఈశ్వరరావు సారవకోటకు రానున్నారు.

రోగులకు సకాలంలో సేవలు అందించాలి

నరసన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందివ్వాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు అన్ని రకాలుగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఊడి సంతోష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏపీపీ రమణమూర్తి, వైద్యురాలు సుధారాణి, ఎంపీడీఓ మధుసూదనరావు, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని, నరసన్నపేట ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుడికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

396 మందికి ఆరోగ్య సేవలు

పాతపట్నం: కేంద్ర ప్రభుత్వం అందించే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం సీహెచ్‌సీ సూపరిటెండెంట్ ఎస్.కృష్ణారావు అన్నారు. సీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 396 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు, రోగులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వైద్యులు వేణుగోపాల్, షణ్ముఖరావు, శేషుబాబు, చిన్నంనాయుడు, అనిత, సునీత, రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.